సాక్షి కామారెడ్డి

సోమవారం । 13 । జనవరి । 2025



ఏటీఎం ధ్వంసం

పిట్లం ఏటీఎంలో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఏటీఎంను ధ్వంసం చేసి రూ 17 లక్షలు ఎత్తుకెళ్లారు.

- 8లో ▸



ఎన్నికలకు సిద్ధం కావాలి

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డి సూచించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
30.6 /16.2

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'మనిషిని ఉత్తముడిగా మార్చేది వైదిక ధర్మం'



కామారెడ్డి అర్బన్: వైదిక ధర్మం, గురుకుల విద్యావిధానం మనిషిని ఉత్తముడిగా మార్చుతాయని స్వామి బ్రహ్మానంద సరస్వతి పేర్కొన్నారు. పాతరాజంపేటలోని ఆర్ష గురుకులం (బ్రహ్మ మహా విద్యాలయం) 42వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వారం రోజుల యోగ సాధన శిబిరం ఆదివారం ముగిసింది. దేశంలోని వివిధ గురుకులాల నుంచి వచ్చిన స్వామీజీలు ఆశిష్ ఆచార్య, దర్శనాచార్య, స్వామి విదేహ్ మహరాజ్, సోమశేఖర ఆచార్య, ఆచార్య వేదమిత్ర, పండిత్ హరిదాస్ ఆర్య తదితరులు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమంలో శ్రీరామనామ జప లిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి, ఆర్ష సమాజ్ అధ్యక్షుడు కంకణాల కిషన్, ఆర్య సమాజ్ ప్రముఖులు రాజు, మోతె బాల్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బాజన్న తదితరులు పాల్గొన్నారు.

'జాతీయ సమైక్యతకు ప్రతీకలు పండుగలు'



కామారెడ్డి అర్బన్: హిందువుల పండుగలు సమాజంలో సమరసత భావన, జాతీయ సమైక్యతకు అద్దం పడతాయని ఆర్‌ఎస్‌ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర సేవా ప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సరస్వతి విద్యామందిర్ హైస్కూల్ ఆవరణలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ భారతదేశమంటే పల్లెసీమలన్నారు. గ్రామాలు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయన్నారు. సంక్రాంతి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథి డాక్టర్ మామిండ్ల మారుతి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు బి.శంకర్, కె.స్వామి తదితరులు పాల్గొన్నారు.

'పురాతన సాహిత్యాన్ని భావితరాలకు అందించాలి'



దోమకొండ: తెలుగు పురాతన సాహితీ సంపదను భావి తరాలకు అందజేయాలని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వెలుదండ నిత్యానందరావు, పద్మభూషణ్ వరప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గడికోటలో దోమకొండ సంస్థానాధీశుడు అనిల్ కామినేని ఆధ్వర్యంలో తెలంగాణ సాహిత్య సమాలోచన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తెలుగు సాహితీ వైభవాన్ని వివరించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, సంగనభట్ల నర్సయ్య, పద్మారాణి, లావణ్య, మధుసూదన్‌శర్మ, శమంత్ తదితరులు తమ కవితలను చదివి వినిపించారు. అనుసంధాన కర్తగా డాక్టర్ ఉమ శేషారావ్ వైద్య వ్యవహరించారు. గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జి, మాజీ జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రమాదాల నివారణకు సహకరించాలి'



పెద్దకొడప్‌గల్: ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని నేషనల్ హైవే యాక్సిడెంట్ మేనేజర్ సారప్రతాప్ కోరారు. ఆదివారం బేగంపూర్‌లో నేషనల్ హైవే అధికారులు రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ హైవే యాక్సిడెంట్ మేనేజర్ సారప్రతాప్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనాలను నడపడం, డ్రంకెన్ డ్రైవ్ ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. వాహనదారులు ప్రతి ఒక్కరు భద్రతా ప్రమాణాలు పాటించి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నేషనల్ హైవే అథారిటీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భరోసాకు ముందడుగు!

- గణతంత్ర దినోత్సవాన శ్రీకారం చుట్టనున్న సర్కారు
- సాగుకు యోగ్యమైన భూములకే రైతు భరోసా
- భూమిలేని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా
- అర్హులైన వారికి ఆహార భద్రత కార్డులు
- నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు
- మార్గదర్శకాలు జారీ



పలు సంక్షేమ పథకాల అమలు దిశగా ముందడుగు పడింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పథకాలకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈనెల 26న గణతంత్ర దినోత్సవం నుంచి ఆయా పథకాలు ప్రారంభం కానున్నాయి.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో మరికొన్నింటిని అమలు చేయడానికి సర్కారు చర్యలు చేపట్టింది. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు రైతుభరోసా పథకం, భూమిలేని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, అర్హులైన పేదలకు ఆహార భద్రత కార్డులు, ఇలు లేని పేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు మంజూరు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. ఆయా పథకాల అమలు కోసం ప్రభుత్వం ఈనెల 10న రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్లతో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆయా పథకాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. గణతంత్ర దినోత్సవం రోజున ఆయా పథకాలకు అంకురార్పణ చేయనున్నట్లు ప్రకటించారు. ఆయా పథకాలకు సంబంధించి ప్రభుత్వం ఆదివారం విధివిధానాలు, మార్గదర్శకాలు జారీ చేసింది. అర్హులకే లబ్ధి చేకూర్చాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం క్షేత్ర స్థాయి పరిశీలన, గ్రామ సభలో జాబితా ప్రదర్శన, చర్చల అనంతరం లబ్ధిదారుల జాబితాను ఆమోదించాలని సూచించింది. ఇందులో భాగంగా ఈ నెల 16 నుంచి 20 వరకు బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటించనున్నాయి. 21 నుంచి 24 వరకు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహిస్తారు. 25 వరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి లబ్ధిదారుల జాబితాను ఆమోదిస్తారు. 26న ఆయా పథకాలను ప్రారంభిస్తారు.

రైతు భరోసా..

పంట పెట్టుబడి సాయంగా ఎకరాకు ఏడాదికి రూ. 12 వేల చొప్పున అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకానికి సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేసింది. భూభారతి (ధరణి) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆధారంగా పట్టాదారులకు రైతుభరోసా సాయం అందించనున్నారు. సాగుకు యోగ్యం కాని భూములను రైతుభరోసా నుంచి తొలగిస్తారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాదారులూ రైతుభరోసాకు అర్హులేనని సర్కారు ప్రకటించింది. ఆర్‌బీఐ నిర్వహించే డీబీటీ(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో రైతుభరోసా సాయం రైతుల ఖాతాల్లో జమ కానుంది. రైతుభరోసా పథకం వ్యవసాయ శాఖ సంచాలకులు అమలు చేస్తారు. నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసీ) ఈ పథకానికి ఐటీ భాగస్వామిగా బాధ్యతలు నిర్వహిస్తుంది. కలెక్టర్లు తమ జిల్లాకు సంబంధించిన పథకం అమలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం బాధ్యులుగా ఉంటారు. వ్యవసాయ శాఖ సంచాలకులు తగు చర్యలు తీసుకుంటారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఇళ్ల నిర్మితమై కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు, రియల్ ఎస్టేట్ లే ఔట్, రోడ్డుగా మారిన భూములు, పరిశ్రమలు, గోదాములకు వినియోగిస్తున్న భూములకు, ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల భూములు, రాళ్లు, రప్పలు, గుట్టలతో నిండి సాగుకు అనువుగా లేని భూములకు రైతుభరోసా వర్తించదు. గతేడాది 3,16,704 మంది రైతులకు రూ. 267.87 కోట్లు రైతుబంధు వచ్చింది. కొత్త నిబంధనలతో లబ్ధిదారుల సంఖ్య తగ్గవచ్చని భావిస్తున్నారు.

రైతు కూలీలకు..

భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు రెండు విడతలలో రూ.6 వేల చొప్పున సంవత్సరానికి రూ.12 వేలు అందించే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని గణతంత్ర దినోత్సవాన ప్రారంభించనున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులు చేసిన భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుంది. గ్రామసభలు నిర్వహించి ముసాయిదా జాబితాను ప్రదర్శించి చర్చించిన తర్వాతే ఆమోదిస్తారు. అభ్యంతరాలుంటే ఎంపీడీవో వాటిని పరిశీలించి పది రోజుల్లో చర్యలు తీసుకుంటారు. అయితే చాలామంది భూమిలేని కూలీలు ఉపాధి హామీ పథకంలో పేర్లు నమోదు చేసుకోలేదని తెలుస్తోంది. దీంతో ఈ పథకం కొద్దిమందికి మాత్రమే వర్తించే అవకాశాలున్నాయి.

కుటుంబ సర్వే ఆధారంగా..

ఇటీవల నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితాను మండల స్థాయిలో ఎంపీడీవోలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు పరిశీలిస్తారు. జిల్లాస్థాయిలో అదనపు కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. ముసాయిదా జాబితాను గ్రామ, వార్డు సభల్లో ప్రదర్శించి చర్చించి, ఆమోదిస్తారు. ఆమోదించిన అర్హుల జాబితాను మండల, మున్సిపల్ స్థాయిలో ఇచ్చిన లాగిన్‌లో నమోదు చేస్తారు. వాటిని కలెక్టర్ పరిశీలించిన అనంతరం సీసీఎస్ కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తుంది. ఆహార భద్రతా కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు కూడా చేయనున్నారు.

సొంతింటి కల నెరవేర్చేందుకు..

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తోంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, సొంత స్థలం ఉన్న వారు ఈ పథకానికి అర్హులు. గుడిసెలు, అద్దె ఇల్లు, రేకుల షెడ్లు, మట్టి గోడలతో నిర్మించిన పెంకుటిళ్లలో నివసిస్తున వారికి ఇళ్లు మంజూరు చేస్తారు. యువ వితంతువులు, భూమిలేని వ్యవసాయ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు, వికలాంగులకు ప్రాధాన్యతనిస్తారు. ప్రజాపాలనలో 2.38 లక్షల మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. 75,200 ఇళ్ల సర్వే జరిగింది. అందులో అర్హులైన వారిని గుర్తిస్తున్నారు. లబ్ధిదారుల ఎంపిక జనవరి 26 నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. కాగా తొలి విడతలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 3,500 ఇళ్లను మాత్రమే మంజూరు చేయనున్నారు.





ఉత్తమ రక్తదాతలు, మోటివేటర్స్‌తో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

'దేశానికే ఆదర్శం కామారెడ్డి రక్తదాతల సమూహం'

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రక్తదాతల సమూహం సేవలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు కావడం ఇందుకు నిదర్శనమని మున్సిపల్ చైర్‌పర్సన్ జి.ఇందుప్రియ పేర్కొన్నారు. రక్తదాతల సమూహం 18వ వార్షికోత్సవం, వివేకానంద జయంతి సందర్భంగా జిల్లాకేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో ఉత్తమ రక్తదాతలు, మోటివేటర్స్‌కు అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ఇందుప్రియ మాట్లాడుతూ 18 ఏళ్లలో 25 వేల యూనిట్ల రక్తం సేకరించడం సాధారణ విషయం కాదన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిలువేరి మారుతి, ఆర్కే విద్యాసంస్థల సీఈవో జైపాల్‌రెడ్డి, ప్రతినిధులు శ్రీకాంత్, గంప ప్రసాద్, జమీల్ హైమద్, ఎర్రం చంద్రశేఖర్, సుధాకర్, నరేందర్‌గౌడ్, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో రాష్ట్ర తొలి విశ్రాంత లోకాయుక్త పర్యటన

బోధన్: పట్టణంలోని ఆచన్‌పల్లి ప్రాంతానికి చెందిన ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర తొలి విశ్రాంత లోకాయుక్తా వెంకట రాములు ఆదివారం స్థానిక చారిత్రక ఆలయాలను సందర్శించారు. హనుమాన్ మందిరం (ఆచన్‌పల్లి), శక్కర్‌నగర్ కోదండరామాలయం, ఏకచక్రేశ్వరాలయం, రేణుకా ఎల్లమ్మ మందిరాలను సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకచక్రేశ్వరాలయంలో ఆలయ కమిటీ అధ్వర్యంలో వేద పండితులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయ కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, డైరెక్టర్లు, తహసీల్దారు విఠల్ సన్మానించారు. బీటీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విశ్రాంత లోకా యుక్త చదువుకున్నారని ఆయన మిత్రులు తెలిపారు. న్యాయవాదులు నర్సింహారెడ్డి, ఇంద్రకరణ్, డాక్టర్ సమ్మయ్య పాల్గొన్నారు.

సౌకర్యాలు లేక.. కాలనీ ఖాళీ



ఒడ్డెర కాలనీలో శిథిలావస్థకు చేరిన ఇళ్లు

గుడిసెలు వేసుకుని జీవనం

- శిథిలావస్థకు చేరిన ఇళ్లు
- ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరుతున్న కాలనీవాసులు

నిజాంసాగర్ : మౌలిక వసతులతో పాటు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఊరినే ఖాళీ చేశారు. అక్కడక్కడ గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. సర్కారు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

మహమ్మద్ నగర్ మండలం తుంకిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఒడ్డెర కాలనీలో 25 కుటుంబాలు ఉండేవి. గతంలో ఇందిరా గాంధీ హయాంలో ప్రభుత్వం వారికి ఇళ్లు కట్టించి ఇచ్చింది. ఈ కాలనీ తుంకిపల్లికి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అయితే తాగునీరు, విద్యుత్, రోడ్డు సౌక ర్యాలు లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొలాల మధ్య నుంచే వెళ్లాల్సి వచ్చేది. చుట్టూ దట్టమైన అటవీ ప్రాంతం ఉండడంతో భయంభయంగా కాలం వెళ్లదీసేవారు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడేవారు. పాలకులకు మొరపెట్టుకున్నా వసతుల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో చాలా ఏళ్ల సమస్యలతో సహవాసం చేసిన ఒడ్డెర కాలనీవాసులు.. పదేళ్ల క్రితం ఇళ్లను వీడి తుంకిపల్లి గేటు వద్ద అటవీ ప్రాంతంలో గుడిసెలు వేసుకుని జీవించసాగారు. అయితే రెండేళ్ల క్రితం అటవీ అధికారులు ఆ గుడిసెలనూ తొలగించడంతో తిరిగి గూడులేని వారయ్యారు. ప్రస్తుతం తుంకిపల్లితో పాటు బాన్సువాడలలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. ప్రభుత్వం ఇళ్లను నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు.




ఒడ్డెర కాలనీలో వృథాగా ఉన్న నీటి ట్యాంకు

ఇళ్లు ఖాళీ చేశాక ట్యాంకు నిర్మాణం..

ఒడ్డెర కాలనీలో సరైన వసతులు లేకపోవడంతో కుటుంబాలన్నీ ఇళ్లను వదిలి వేరే ప్రాంతానికి వెళ్లిపోయాయి. ఇళ్లన్నీ ఖాళీ అయ్యాక పాలకులు మేల్కొన్నారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఒడ్డెర కాలనీలో 20 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మించారు. ఒక్క కుటుంబమూ నివాసం ఉండని చోట వాటర్ ట్యాంకు నిర్మించడం గమనార్హం.


“ పట్టించుకునేోళ్లే లేరు..



కాలనీలో వసతులు లేక ఇల్లు ఖాళీ చేసినం. ఎక్కడన్న గుడిసె వేసుకుందామంటే సర్కారు జాగ దొరుకుతలేదు. మస్తు తిప్పలు పడుతున్నం. మమ్మల్ని పట్టించుకున్నోళ్లే లేరు.

– ఒడ్డె వెంకటి, ఒడ్డెర కాలనీవాసి, తుంకిపల్లి

ఇల్లు కట్టించి ఇవ్వాలి



అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు కట్టించి ఇచ్చింది. ఊరికి దూరంగా ఉన్నా మా కాలనీలో కరెంటు, తాగు నీరు వసతి లేకపోవడంతో ఉండలేకపోయాం. సర్కారు ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఇవ్వాలి.

– ఒడ్డె పోచయ్య, ఒడ్డెర కాలనీవాసి, తుంకిపల్లి

కష్టకాలంలో బీఆర్‌ఎస్‌కు ద్రోహం చేశారు

- పోచారంపై విరుచుకుపడ్డ ఎమ్మెల్సీ కవిత
- పార్టీ మారి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని సవాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన మాజీ ఎమ్మెల్యే సురేందర్, జెడ్పీ మాజీ చైర్మన్లు



గజమాలతో కవితను సత్కరిస్తున్న కార్యకర్తలు

బాన్సువాడ : ''ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో స్పీకర్‌గా పని చేసిన వారు మళ్లీ ఎన్నికల్లో గెలవలే.. కానీ బాన్సువాడ ప్రజలు కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో పోచారం శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించి చరిత్ర తిరగరాశారు. అయితే బీఆర్‌ఎస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఆయన పార్టీని వదిలి ద్రోహం చేశారు'' అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. ఆదివారం బాన్సువాడకు వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడారు. బాన్సువాడ అభివృద్ధికోసం పార్టీ మారానని పోచారం చెబుతున్నారని.. ఆయన పార్టీ మారి ఆరునెలలు దాటిందని, ఎంత అభివృద్ధి చేశారో చెప్పాలని సవాల్ చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు బాన్సువాడ నియోజకవర్గానికి సంవత్సరానికి వెయ్యి కోట్ల రూపాయల చొప్పున నిధులు ఇచ్చారన్నారు. ఇప్పుడు పోచారం అన్ని నిధులు తీసుకురాగలరా అని సవాల్ చేశారు. గతంలో బాన్సువాడకు 30 వేల కేసీఆర్ కిట్లు ఇచ్చామని, కాంగ్రెస్ హయాంలో ఎన్ని కిట్లు ఇచ్చారో చెప్పాలని పేర్కొన్నారు. పోచారం వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రైతుబంధు పథకం ప్రవేశ పెట్టామని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏటా రూ. 15 వేలు ఇస్తామని చెప్పి దానిని రూ. 12 వేలకు తగ్గించి రైతులను మోసం చేస్తుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తిమ్మాపూర్‌లోని తిరుమల వేంకటేశ్వర ఆలయానికి రూ.30 కోట్లు కేసీఆర్ ఇచ్చారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆసరా పింఛన్ రూ. 4 వేలకు పెంచుతామని, మహిళలకు ప్రతినెలా రూ. 2,500 చొప్పున ఇస్తామని చెప్పారని, ఏడాది గడిచినా వాటిని అమలు చేయడం లేదని, దీనిపై పోచారం మహిళలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో దేశంలోనే బాన్సువాడ ఆస్పత్రి నంబర్ వన్‌గా నిలిచిందని పేర్కొన్నారు. ఈ ఏడాది కాలంలో బాన్సువాడ ఆస్పత్రి ప్రాభవం ఎందుకు తగ్గిందో చెప్పాలన్నారు. కోతల కాంగ్రెస్ పార్టీలో పోచారం ఎందుకు చేరారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలకు, ప్రజలకు తాను అందుబాటులో ఉంటానన్నారు. రాబోయే రోజుల్లో బాన్సువాడలో గులాబీ జెండా ఎగుర వేస్తామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జెడ్పీ మాజీ చైర్మన్లు దఫేదార్ రాజు, దాదన్నగారి విఠల్‌రావు, బోధన్ మాజీ ఎమ్మెల్యే సతీమణి అయేషా బేగం, మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, నాయకులు గణేష్, సాయిబాబా, మల్లేష్ గౌడ్, సాయిలు, మహేష్, రమేష్ యాదవ్, మౌలానా, గౌస్, సాయిలు పాల్గొన్నారు.



కవితకు ఘన స్వాగతం

బాన్సువాడకు వచ్చిన ఎమ్మెల్సీ కవితకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆమె ముందుగా కొయ్యగుట్ట వద్దనున్న అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీతో బాన్సువాడకు చేరుకున్నారు. మార్కెట్ కమిటీ వద్ద నుంచి మహిళలు బోనాలు, బతుకమ్మలతో స్వాగతం పలికారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద గజమాలతో సత్కరించారు. అనంతరం కవిత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు.

'స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి'

కామారెడ్డి టౌన్: స్వామి వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సూచించారు. ఆదివారం జిల్లాకేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ వద్దనున్న స్వామీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. యువత రాజకీయాల్లో రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు భరత్, మున్సిపాలిటీలో బీజేపీ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్, కౌన్సిలర్ నరేందర్, నాయకులు సంతోష్‌రెడ్డి, వేణు, రాజు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



వివేకానంద విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్, బీజేపీ నాయకులు

క్లుప్తంగా

పండిత్ పరిషత్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నిక


ఘనపురం దేవేందర్

నిజామాబాద్ రూరల్: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నిజామాబాద్ జిల్లాకు చెందిన జెడ్పీ హెచ్ఎస్ సారంగపూర్ తెలుగు ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి ఘనపురం దేవేందర్ ఎన్నికయ్యారు. హైదరాబాద్ హిందీ ప్రచార సభ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన సంఘం రాష్ట్రసర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఎండీ అబ్దుల్లా, కాంతి కృష్ణ, భిక్షపతి, ఎండి జమీల్, కేవీ రమణాచారి తదితరులు ఉన్నారు.

యువ రైతులు సంఘటితం కావాలి



నిజామాబాద్ నాగారం: యువ రైతులు సంఘటితం అయి కొత్త రకపు వ్యవసాయం చేయాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. జూబ్లీహిల్స్ రూట్స్ కాలేజీలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువ దినోత్సవం సందర్భంగా సేవ్ గ్లోబల్ ఫార్మర్స్ ఆధ్వర్యంలో యువ రైతు పురస్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై, వివిధ జిల్లాల నుంచి వచ్చిన యువ రైతులకు పురస్కారాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యువత వ్యవసాయంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. రూట్స్ కాలేజీ అధినేత భిక్షపతి, రవీందర్ ర్యాడ, ఆర్మూర్ శ్రవణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ నాగారం: నగరంలోని జీజీహెచ్‌లో రోగి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోదావరి కోరారు. ఈ మేరకు ఆమె సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. మరోవైపు ఆస్పత్రిలో సూపరింటెండెంట్ జన్మదిన వేడుకలు జరుపుకున్న ఘటనపై కూడా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11న లక్ష్మి అనే రోగికి ఫిట్స్ వస్తోందని ఆస్పత్రికి తీసుకొస్తే పట్టించుకోలేదన్నారు.

టాస్క్‌ఫోర్స్ దాడులు



బోధన్: పట్టణంలోని పలు చోట్ల ఆదివారం టాస్క్‌ఫోర్స్ టీం ఏసీపీ నాగేంద్రచారి నేతృత్వంలో సీఐ అంజయ్య, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈమేరకు ఇన్‌చార్జి సీపీ ఒక ప్రకటనలో తెలిపారు. పక్కా సమాచారం మేరకు ఆఫీసర్స్ క్లబ్‌పై దాడి చేసి పేకాడుతున్న 22 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 31వేల నగదు, 24 సెల్ ఫోన్‌లు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బోధన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అలాగే ఏఆర్ కిరాణా షాప్‌పై దాడి చేసి రూ. 8వేలు విలువ చేసే 8 చైనా మాంజా బాబిన్లను స్వాధీనం చేసుకున్నారు. షాప్ యాజమాని జునైద్ ఖాన్‌ను అదుపులోకి తీసుకుని పీఎస్‌లో అప్పగించారు.

సంక్రాంతి పండుగ.. ఔషధాలు మెండుగ

గరిక..
- గరికలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి.
- పచ్చి గరికను మెత్తగా నూరి గాయంపై పూస్తే మానిపోతాయి.
- ప్రకృతి సమతుల్యతను కాపాడుతుంది.
- దగ్గు,ఆయసం,మలబద్దకం నివారిస్తుంది.

బియ్యం..
- కడిగిన బియ్యం నీటిని పంచదారతో సేవిస్తే మూత్ర విసర్జన సాఫీగా ఉంటుంది.
- త్రిదోషహరిణిగా పనిచేస్తుంది
- శరీరానికి కార్బోహైడ్రేట్లు అధికంగా అందుతాయి.

గొబ్బెమ్మలు..



- ఆవుపేడతో తయారు చేయడంతో క్రిమిసంహారకంగా పనిచేస్తుంది.
- ప్రకృతి కాలుష్య నివారిణి
- ఉష్ణ ఉత్పత్తి ఉపయోగాలు అధికం

- ముగ్గుల నుంచి పిండివంటకాల వరకు ఎన్నో ప్రత్యేకతలు

బోధన్‌రూరల్: ప్రత్యేకతలకు పెట్టింది పేరు హిందూ పండుగలు. ఒక్కో పండుగ ఒక్కో గొప్పతనాన్ని చాటుతుంటాయి. అందులో అతి ప్రత్యేకమైనది మన తెలుగు పండుగ సంకాంత్రి. ఈ పండుగ రోజున నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో ఎంతో విశేషం ఉంది. వేకువజామున ఇంటి ముందు వేసే రంగురంగుల ముగ్గుల నుంచి, ఇంట్లో చేసే పిండివంటకాల వరకు వేటికవి ఎంతో ప్రాముఖ్యం కలిగిఉన్నాయి. ఎన్నో ఔషధాలు, జీవకోటికి మేలు చేసే ప్రాముఖ్యతను పొందాయి. రానున్న సంక్రాంతి పండుగ నేపథ్యంలో మన పూర్వీకుల నుంచి వస్తున్న సంకాంత్రి సంప్రదాయాలు, ప్రత్యేకతలపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

పొంగలి..



- సంకాంత్రి నాడు చేసే పొంగాలికి బియ్యం, నువ్వులు, బెల్లం ఉపయోగిస్తారు. దీనితో పాటు పండగ రోజు పిండితో అరిసెలు చేస్తారు. వీటిలో కూడా పోషక విలువలు అధికంగా ఉంటాయి.

పూర్వకాలంలో మన పెద్దలు రాబోయే వైరస్‌లు, వ్యాధులను ముందుగా గ్రహించి వాటికి అనుగుణంగా ముందస్తుగా జాగ్రత్తలు పాటించేవారు. వాటిని పండుగలు, పర్వదినాల్లో మిళితం చేస్తూ ప్రకృతిలోని ఔషధాలు, పదార్థాలను వినియోగించే వారు. అలాగే సంకాంత్రి పండుగలో సైతం అనేక ప్రత్యేకమైన ఔషధాలు, సహజసిద్ధ పదార్థాలను వినియోగించేవారు. ప్రకృతిలో లభించే వరి, శనగలు, మినుములు, నువ్వులు, సజ్జలు, పెసర్లు, బొబ్బర్లు, ఉలవలు వంటి రకరకాల ఆహర పదార్థాల్లో అనేక ఔషద గుణాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. సంకాంత్రి ముందురోజు భోగి నాడు మూడెళ్ల లోపు పిల్లలకు గ్రహణ పీడలు, శని తొలగి సకల ఐశ్వర్యాలతో ఉండాలని కోరుతూ రేగి పండ్లు పోస్తారు. గొబ్బిళ్ల చుట్టూ ధాన్యాలు పోసి పశు పక్ష్యాదులకు ఆహారంగా అందిస్తారు. మరుసటి రోజు సంకాంత్రి నాడు కొత్త బియ్యం, బెల్లం, నువ్వులతో పులగం వండుకుంటారు. ఇలా సంకాంత్రి పండగ సమయంలో చేసే పనులన్నింటి వెనుక శాస్త్రీయ కోణం దాగి ఉంది.

నువ్వులు..



- శరీరంలో ఉష్ణ ఉత్పత్తిని పెంచుతాయి.
- ఔషద గుణం ఉంటుంది
- మూత్ర వ్యాధులను తొలగిస్తుంది
- ఎముకల్లో మజ్జ ఉత్పత్తిలో ప్రధాన ప్రాత వహిస్తుంది

బెల్లం..



- రక్తం వృద్ధి అయ్యేలా పని చేస్తుంది.
- శరీరంలో ఖనిజ లవణాలను పెంచుతుంది
- శరీరాన్ని కాంతిమాయంగా చేస్తుంది
- సర్వ దోష లక్షణాలను నివారిస్తుంది

పిండి కొమ్మలు (ఉత్తరేణి)..



- ఉత్తరేణి పుల్లలతో పళ్ల తోమ్ముకుంటే దంతాక్షయం తొలగిపోతుంది.
- జీర్ణ వ్యాధులు, త్రిదోశ, ఉదరవ్యాధుల నివారిణి
- పైత్యరసం ఉత్పత్తిలో ప్రాత వహిస్తుంది.

తంగేడు పూలు..
- శరీరానికి చలువ
- మధుమేహం, కఫం, అతిమూత్ర వ్యాధిని నివారిస్తుంది
- పువ్వులు కషాయంగా చేసుకోని సేవిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- కంటి చూపు బలపడుతుంది

పసుపు..



- క్రిమి సంహరిణిగా పని చేస్తుంది
- కామేర్ల వ్యాధి నివారణకు కృషి చేస్తుంది

రేగి పండ్లు....



- వాతం, మధుమేహం, మూల వ్యాధి నివారిణి
- రక్త శుద్ధి, ఉత్పత్తిలో ఉపయోగపడుతుంది.
- శరీరానికి అవసరమైన వేడి పుట్టించడంతోపాటు చలువ కూడా చేస్తుంది
- విటమిన్ 'సీ' పుష్కలంగా లభిస్తుంది

నలభై ఐదేళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం



హాజరైన కామారెడ్డి బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాల 1978-79 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాల 1978–79 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు 45 సంవత్సరాల తర్వాత ఆదివారం స్థానిక హోటల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకుని తమ జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈ బ్యాచ్‌లో చాలా మంది దివంగతులు కాగా.. వారికి నివాళులర్పించారు. హాజరైన వారిలో జేఎన్‌టీయూ విశ్రాంత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూరు హుస్సేన్, ఎన్పీడీసీఎల్ సీఈ కె.నర్సింహ, విశ్రాంత డీఎఫ్‌వో రాములు, రాజు, తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఆముద మణికంఠ ఎంపిక



రాజంపేట: రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి రాజంపేట గ్రామానికి చెందిన ఆముద మణికంఠ ఎంపికైనట్లు కోచ్ రియాజ్ తెలిపారు. గత డిసెంబర్ నెలలో 16 నుంచి 26 వరకు జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలలో 58 జట్లు పాల్గొనగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఆముద మణికంఠ తన ప్రతిభతో మొదటి మ్యాచ్‌లో 5 వికెట్లు, రెండో మ్యాచ్‌లో 3 వికెట్లు పడగొట్టి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ఏటీఎం ధ్వంసం.. నగదు చోరీ



పిట్లం(జుక్కల్): గుర్తు తెలియని దుండగులు ఏటీఎంను ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లిన ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పిట్లం మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎస్బీఐ ఏటీఎంను గుర్తుతెలియని దుండగులు ఆదివారం తెల్లవారు జామున గ్యాస్‌కటర్ సహాయంతో ధ్వంసం చేశారు. అందులోని రూ. 17 లక్షల 79 వేల ఒక వంద నగదును చోరీ చేశారు. ఉదయం స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సీసీపుటేజ్, వేలి ముద్రలు సేకరించారు. ఎస్బీఐ ఏటీఎం సూపర్‌వైజర్ రాచర్ల ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

లోన్ మాఫీ చేస్తామంటూ మోసం..నిందితుడి అరెస్టు

ఖలీల్‌వాడి: బ్యాంకులో ఉన్న రూ. 50 లక్షల రుణాన్ని మాఫీ చేయిస్తానని చెప్పి ఓ వైద్యుడి వద్ద డబ్బులు వసూలు చేసి, మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్‌లోని బీరప్పనగర్‌కు చెందిన బంగారు అప్పారావు (30) బ్యాంక్ రుణాలు మాఫీ చేయిస్తానని మోసాలకు పాల్పడుతుండేవాడు. తనకున్న పలుకుబడితో నగరంలోని డాక్టర్ని నమ్మించి బ్యాంకు లోన్ సెటిల్మెంట్ చేస్తానని తెలిపి అతని వద్ద నుంచి రూ. 15లక్షల తీసుకుని మోసం చేశాడు. దీంతో అతడు నగరంలోని ఒకటో టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. నిందితుడిని పట్టుకోగా కోరుట్లకు చెందిన డాక్టర్ వద్ద సుమారు రూ. 60లక్షలు, మోర్తాడ్‌కి చెందిన డాక్టర్ వద్ద రూ.12 లక్షలు డబ్బులు తీసుకున్నట్లు తెలిపారు. వీరే కాకుండా ఇతరుల నుంచి చాలామంది దగ్గర లోన్ సెటిల్మెంట్ చేస్తానని ఎక్కువ మొత్తంలో డబ్బులు దండుకున్నట్లు వివరించారు. ఈ డబ్బులు అన్ని రియల్ ఎస్టేట్ లోనూ అప్పుల రూపంలోనూ ఇతరులకు ఇచ్చినట్లు తెలిపారు. ఈ డబ్బులతో కొన్ని ప్లాట్స్ కొన్నాడన్నారు. బంగారు అప్పారావు పట్టుకుని రిమాండ్ చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. ఈ కేసు విషయంలో ఇంకా విచారణ కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్.. ఒకరి మృతి

రుద్రూర్: పోతంగల్ మండలం జల్లాపల్లి శివారులో ఆదివారం రాత్రి బైక్‌ను ఓ ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. కోటగిరి మండలం ఎత్తొండ గ్రామానికి చెందిన యాదు(35) తన భార్య, ఇద్దరు చిన్నారులతో బైక్‌పై వస్తుండగా జల్లాపల్లి శివారులో వారిని ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్నవారు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు వారిని బోధన్ ఆస్పత్రికి తరలించగా, మార్గమధ్యలో యాదు మృతి చెందాడు. మృతుని భార్య అనిత, ఇద్దరు చిన్నారులు అస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి కుటుంబం మహారాష్ట్రలోని సాంగ్లీ నుంచి ఎత్తొండకు వలస వచ్చి జీవనాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

ఒకరి ఆత్మహత్య

బోధన్ రూరల్(బోధన్): మండలంలోని బండారుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈనెల 9న ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. బండారుపల్లి గ్రామానికి చెందిన మల్లప్పగారి మాధవరావు(55) జాడిజ మాల్‌పూర్ గ్రామానికి చెందిన రెంజర్ల(చాకలి) లక్ష్మికి సన్నిహిత సంబంధం ఉంది. లక్ష్మి సుమారు 20రోజుల క్రితం తాను పని చేసే యజమాని ఇంట్లో రూ. 45వేలు దొంగలించి సొంతానికి వాడుకుంది. ఆ డబ్బులను చెల్లించాలని లక్ష్మి, ఆమె కొడుకు భూమయ్య, కోడలు రుక్మిణి మాధవరావును తరచు వేధించేవారు. తమకు డబ్బు ఇవ్వకపోతే దొంగిలించిన డబ్బు తనకే ఇచ్చినట్లు పోలీసులకు చెబుతానని మాధవరావును బెదిరించింది. ఈ క్రమంలో మాధవరావు భయపడి బిక్నెల్లి శివారులోని మంజీర నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిరికొండ: మండలంలోని కొండాపూర్ గ్రామ సమీపంలో రేషన్ బియ్యం తరలిస్తున్న మినీ వ్యాన్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రామ్ ఆదివారం తెలిపారు. గ్రామ సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి తన వాహనంలో ఎలాంటి అనుమతి లేకుండా రేషన్ బియ్యం తరలిస్తున్నాడని తెలిపారు. పోలీసులను చూసి ఆ వ్యక్తి తన వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయాడని తెలిపారు. వాహనంలో తనిఖీ చేయగా 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హుండీ చోరీ

బోధన్ రూరల్ (బోధన్): మండలంలోని రాజీవ్ నగర్‌తండా గ్రామంలోని జగదాంబ దేవి ఆలయంలో ఉన్న హుండీని గుర్తుతెలియని దుండగులు పగులగొట్టిన చోరీ చేసినట్లు రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. హుండీలో ఉన్న సుమారు రూ. 5వేల నగదును దుండులు దోచుకెళ్లారన్నారు. ఆలయ క్యాషియర్ నేనావత్ మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంక్రాంతి ముగ్గుల సంబురం


కామారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో ముగ్గుల పోటీలు


గిద్దలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరీంనగర్ డెయిరీ ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: వీహెచ్‌పీ, మాతృశక్తి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, కార్యదర్శి బి.రాజు, నగర అధ్యక్షుడు వి.వెంకటస్వామి, మాతృశక్తి సంయోజక రాజ్యశ్రీ, సహ సంయోజక ఇందిర తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో..

రామారెడ్డి: గిద్ద గ్రామంలో కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు డెయిరీ ప్రతినిధులు బహుమతులను అందజేశారు. డెయిరీ అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి, జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవదాన్ పాఠశాలలో..

ఎల్లారెడ్డి: పట్టణంలోని జీవదాన్ పాఠశాలలో ముగ్గుల పోటీలు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుర్మ సాయిబాబా నిర్వహించారు. ఈ పోటీలను మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, డీఎస్పీ శ్రీనివాసులు ప్రారంభించారు. అనంతరం విజేతలకు మొదటి బహుమతిగా 5 తులాల వెండి, ద్వితీయ బహుమతిగా 3 తులాల వెండిని బహూకరించారు.

బాన్సువాడలో..

బాన్సువాడ: బాన్సువాడ ఎన్‌జీవోస్ కాలనీలో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్నారులకు పతంగుల పోటీలు పెట్టారు. చూడముచ్చటగా ముగ్గులు వేసిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ విజయలక్ష్మి, సుజాత, మనస్విని, శ్రుతిక, చంద్రశ, సమన్విత పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిలో ముగ్గులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్, డీఎస్పీ శ్రీనివాసులు


ఎన్‌జీవోస్ కాలనీలో ముగ్గులు వేస్తున్న మహిళలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి


శెట్పల్లిలో సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలని మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం శెట్పల్లిలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మండల సమన్వయకర్త అట్టెం శ్రీనివాస్, ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడ్వాయి పరిధిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రాహ్మణపల్లి, కాళోజీవాడి, దేవాయిపల్లి గ్రామాలలో ఆదివారం ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ నాయకులు ప్రజలకు వివరించారు. అలాగే బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మండల కో–ఆర్డినేటర్ పైడి రాజేశ్వర్‌రెడ్డి, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గైని శివాజీ, మండల ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేటలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పథకాలపై నాగిరెడ్డిపేటలో ఆదివారం గ్రామ కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సాయాగౌడ్, మండల కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పథకాల గురించి వివరించారు.


కాళోజీవాడిలో పథకాల గురించి వివరిస్తున్న నేతలు ,


నాగిరెడ్డిపేటలో..

నాసిరకం ఫిల్టర్ల వాడకం

నీటిని శుద్ధి చేయని ఫిల్టర్లు
- స్వచ్ఛమైన తాగు నీటి కోసం ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని ఉపాధ్యాయులు, అధికారులు


బిచ్కుంద బోయివాడ పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ఫిల్టర్

బిచ్కుంద(జుక్కల్): విద్యార్థులకు స్వచ్ఛమైన తాగు నీరు అందించి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలనే మంచి ఉద్దేశంతో ప్రభుత్వం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు రూ.లక్షల నిధులు మంజూరు చేసింది. ట్యాంకులు బిగించి స్వచ్ఛమైన నీటి కోసం వాటర్ ఫిల్టర్లు అమర్చాలని ఆదేశించింది. జిల్లాలో ఒకటి రెండు చోట్ల తప్ప అన్ని మండలాల్లో అమర్చిన వాటర్ ఫిల్టర్లు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. బిచ్కుంద మండలంలో పనులు జరిగేటప్పుడు అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు నాసిరకం ఫిల్టర్లు అమర్చి చేతులు దులుపుకున్నారు. నాసిరకం వాటర్ ఫిల్టర్లు బిగించడంతో నీరు శుభ్రం కావడం లేదు.. దీంతో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు. వాస్తవానికి నీటిని శుద్ధి చేయడానికి ఫిల్టర్ చేసే క్యాండిల్ రంధ్రాలు కంటికి కనబడనంత చిన్నగా ఉంటాయి. ఈ రకమైన ఫిల్టర్‌తో నీటిలోని బ్యాక్టీరియా, దుమ్ము, ధూళి తొలగి మంచి నీరు వస్తాయి. కాని బిచ్కుంద బోయివాడ పాఠశాలలో బిగించిన వాటర్ ఫిల్టర్లు నాసిరకంగా ఉన్నాయి. అందులో ఫిల్టర్ క్యాండిల్ లేదు.. ప్లాస్టిక్ జాలీ మాత్రమే ఉంది. ఆ జాలీ ద్వారా నీరు శుద్ధి కావడం లేదు. ఈ కారణంగా విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందని ద్రాక్షలా మారింది.

పేరుకే అమ్మ ఆదర్శ కమిటీలు..

పాఠశాలల పర్యవేక్షణ, అభివృద్ధి కోసం ఉన్న ఎస్ఎంసీ కమిటీలను ప్రభుత్వం రద్దు చేసి కొత్తగా అమ్మ ఆదర్శ కమిటీలు వేసింది. పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు, వాటర్ ఫిల్టర్లు, మరుగుదొడ్లు, విద్యుత్ ఇతర పనులు ఈ కమిటీల ఆధ్వర్యంలోనే జరిగాయి. కమిటీలు, సంబంధిత అధికారుల పనుల పర్యవేక్షణ లేకపోవడంతో నాసిరకం పనులు చేసి చేతులు దులుపుకున్నారు. బిగించిన ఫిల్టర్‌తో నీరు శుద్ధి కాకపోవడంతో నీటి నుంచి దుర్వాసన వస్తుంది. విద్యార్థులు పాఠశాలలోని నీరు తాగడం లేదు.. ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నాణ్యమైన ఫిల్టర్లు బిగించి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

చైన్ స్నాచర్ల అరెస్టు


రికవరీ చేసిన బంగారు గొలుసులు


వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఒక మైనర్‌తో పాటు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆర్మూర్ పోలీస్‌స్టేషన్లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పట్టణంలోని జెమ్మన్‌జట్టి గల్లీకి చెందిన బట్టు బాల్‌రాజ్ ఓ మైనర్ అబ్బాయితో కలిసి నంబర్‌లేని స్కూటీపై తిరుగుతూ పలు చోట్ల చైన్ స్నాచింగ్ పాల్పడినట్లు తెలిపారు. మామిడిపల్లిలోని రకుంబాయి మెడలో నుంచి, పెర్కిట్ విశాఖ కాలనీలో, రాజారాం నగర్‌లో మహిళల మెడలో నుంచి బంగారు గొలుసులను చోరీ చేశారన్నారు. సదరు నగలను పట్టణంలోని హరిచంద్రప్రసాద్‌కు విక్రయించారన్నారు. ఆదివారం ఉదయం పట్టణంలో నిందితులను అదుపులో తీసుకొని విచారించామన్నారు. బాల్‌రాజ్‌తోపాటు నగలను కొనుగోలు చేసిన హరిచంద్రప్రసాద్‌ను రిమాండ్‌కు తరలించారు. బాలున్ని జువైనల్ హోమ్‌కు తరలించారు. కాగ నిందితుల వద్ద నుంచి 75గ్రాముల బంగారాన్ని, స్కూటీను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏసీపీ ఐడీ పార్టీ సిబ్బందికి, కానిస్టేబుళ్లకు రివార్డులు అందించి అభినందించారు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, ఎస్సైలు గోవింద్, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.